

'సోమశిల' నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అట్లూరు : సోమశిల బ్యాక్ వాటర్ కింద నష్టపోయిన గ్రామాలలో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేతవరకు డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. శనివారం మండలంలోని డివైఎఫ్ఐ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్ ప్రాజెక్టు నిర్మించే సమయంలో అట్లూరు మొదలుకుని ఒంటిమిట్ట మండలాల వరకు అనేక గ్రామాలు ఖాళీ చేయించారని పేర్కొన్నారు. ఖాళీ చేయించేటప్పుడు అప్పటి ప్రభుత్వం గ్రామాల్లో నిరుద్యోగులుగా ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి ఇంటికొక ఉద్యోగం ఇస్తామని చెప్పిందని పేర్కొన్నారు. తరువాత ఎన్ని ప్రభుత్వాలు మారినా ముంపు గ్రామాల్లో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవని వాపోయారు. కొందరికి మాత్రం అరకొర ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.

దారుణం

- ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పి
- విద్యార్థినితో వాంగ్మూలం నమోదు చేసిన జడ్జి
- పోలీసుల అదుపులో నిందితుడు?



పెట్రోల్ దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని దస్తగిరమ్మ

ప్రజాశక్తి-గోపవరం/బద్వేలు

ఎన్ని కఠిన చట్టాలు అమలైన విద్యార్థినులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. మానవ మృగాల ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. తాజాగా తనను ప్రేమించడం లేదని ఇంటర్మీడియట్ విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటన కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని గోపవరంలో శనివారం చోటు చేసుకుంది. విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే...బద్వేల్ పట్టణంలోని రామాంజనేయ నగర్‌కు చెందిన దస్తగిరమ్మ(17) ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతుంది. శనివారం ఉదయం కళాశాలకు ఇంటి నుంచి బయలుదేరిన దస్తగిరమ్మను మాట్లాడాలని బైక్‌పై ఎక్కించుకుని మండల పరిధిలోని సెంచరీ ఫ్లైవుడ్ వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ అతని ప్రేమను తిరస్కరించడంతో జక్కుల విగ్నేష్ పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. మంటలు తాళలేక బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బాలికను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలిక శరీరం 80 శాతంపైగా కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విగ్నేష్‌కి ప్రేమ వివాహమై భార్య గర్భవతిగా ఉంది. దస్తగిరమ్మను, విగ్నేష్‌కు మధ్య ఏం జరిగిందనే దానిపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేశ్ తమ కుమార్తెను వేధిస్తున్నాడని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అతనికి వివాహమైనా వేధింపులు ఆపలేదని, ఇవాళ పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బద్వేల్ ఎమ్మెల్యే సుధా రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పి హర్షవర్ధన్‌రాజు

నిందితుడి కోసం గాలింపు ముమ్మరం : ఎస్పి

గోపవరం సమీపంలో ఇంటర్ విద్యార్థినిపై విగ్నేష్ అనే యువకుడు పెట్రోలు పోసి దాడి చేసిన ఘటనపై నాలుగు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని ఎస్పి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితిపై ఆరా తీశారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినికి 80 శాతం వరకు గాయాలయ్యాయని తెలిపారు. చిన్నప్పటి నుండి యువకుడు విగ్నేష్ విద్యార్థినికి పరిచయం ఉందని తెలిపారు. ఇద్దరూ బద్వేల్ పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన వారని వెల్లడించారు. నిందితుడి కోసం నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేస్తున్నామని తెలిపారు. నిందితుని త్వరలో అరెస్టు చేసి వాస్తవాలను వెలికితీస్తామన్నారు. దస్తగిరమ్మకు, విగ్నేష్‌కు మధ్య ఏం జరిగిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేయండి : చంద్రబాబు

ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు స్పందించారు. అధికారులతో మాట్లాడారు. విద్యార్థిని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.



కుమార్తెను చూసి విలపిస్తున్న విద్యార్థిని తల్లి

టిడిపి నగర అధ్యక్షులు శివకొండారెడ్డిపై దాడి

- కర్రలతో కొట్టిన ముగ్గురు యువకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి పై గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. ద్విచక్ర వాహనపై వెళుతున్న ఆయనపై యువకులు ఒక్కసారిగా కర్రలతో వీపు, తలపై దాడి చేశారు. శనివారం ఉదయం శివకొండారెడ్డి స్కూటిలో తన ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో మానస కళ్యాణ మండపం వద్ద ఉన్న పాలకేంద్రం వద్ద పాలు తీసుకునేందుకు ఆగారు. అదే సమయంలో ముగ్గురు యువకులు పసుపు పచ్చ స్కూటిలో వచ్చి కర్రలతో దాడి చేశారు. స్థానికులు పరుగు పరుగున రావడంతో ఆ ముగ్గురు యువకులు కర్రలు పడవేసి రాజంపేట బైపాస్ వైపు పరారయ్యారు. సంఘటనలో వీపు వెనుక వైపు, తలకు రక్తగాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను ప్రభుత్వసర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని చిన్న చౌక్ సిఐ తేజ మూర్తి, ఎస్ఐ లు రాజరాజేశ్వర్ రెడ్డి, రవికుమార్ పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం టీములు ఏర్పాటు చేసి వేగంగా గాలిస్తున్నామని సిఐ తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న శివకొండారెడ్డిని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కర్యదర్శి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు వి.ఎస్ అమీర్ బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి పలువురు నాయకులు పరామర్శించారు. అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజులు కలిసి దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. **హత్య చేయటానికి ప్రయత్నించారు..** దాడిపై శివకొండారెడ్డి మాట్లాడుతూ తనను హత్య చేసేందుకే ముగ్గురు యువకులు పసుపు కలర్ స్కూటిలో వచ్చారన్నారు. తన పై దాడికి పాల్పడిన వారిని తాను గుర్తించలేదన్నారు. 'ఎవరు రా మీరు' అని వారిని గుర్తించే లోపే పారిపోయారన్నారు. తనకు ఎవరితో ఎలాంటి వ్యక్తిగత తగాదాలు లేవన్నారు. దాడి చేసిన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సంఘటనతో కార్యకర్తలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. తనకు ప్రస్తుతం ఎవరి పై అనుమానం లేదని పోలీసులే నిగ్గు తేల్చాలని కోరారు.



దాడి చేస్తున్న యువకుడు, గాయపడిన శివకొండారెడ్డి

జమిలి ఎన్నికలు పిచ్చి తుగ్లక్ నిర్ణయం

ప్రజాశక్తి - కడప అర్బన్

జమిలి ఎన్నికల నిర్ణయం పిచ్చి తుగ్లక్ నిర్ణయమని, ఇది ఆచరణ సాధ్యం కాదని వక్తలు పేర్కొన్నారు. శనివారం కడప ప్రెస్ క్లబ్‌లో ఎన్నికల అక్రమాలు, ఇవిఎంలు, జమిలి ఎన్నికలు అనే అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంతటా లోక్ సభకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ లకు, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరపడం (జమిలి ఎన్నికలు) సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఇందుకు 18 రాజ్యాంగ సవరణలు చేయాలని పేర్కొన్నారు. అందుకు మోడీ ప్రభుత్వానికి లోక్ సభలో 69 సీట్లు, రాజ్య సభలో43 సీట్లు తక్కువ ఉన్నాయన్నారు. ఎన్నికల ఖర్చు మొత్తం బడ్జెట్ లో 0.02 శాతం మాత్రమే కాబట్టి ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలు అనడంలో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణ జాతీయ ఉద్యమ నాయకుడు సంగటి మనోహర్, అవ్వారు మల్లికార్జున, షేక్. అమీన్ పీరా, అఫ్జల్‌ఖాన్, డాక్టర్ శ్రీనివాసులు, అబ్దుల్ సత్తార్, గోసాల దేవి, శాంతయ్య, కదిరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పారిశుధ్య పనులు నిత్యం చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో పారిశుధ్య పనులు నిత్యం చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం లోహియా నగర్, కృపానగర్, ఎస్‌బిఐ కాలనీ, ఎఎస్ఆర్ నగర్, ఆచార్య కాలనీ, రామరాజు పల్లి వంటి ముఖ్య ప్రాంతాలను సందర్శించారు. ప్రజల ఆరోగ్యం, శుభ్రతపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అధిక జనాభా ఉన్న చోట శానిటేషన్, వ్యర్థ నిర్వ ఃహణ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడం అత్యవసరమన్నారు. వ్యర్థాల పారిశుధ్య విధానాలను పరిశీలించి, వర్షాకాలంలో నీరు నిలువకూడా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌బిఐ కాలనీ వద్ద డ్రెయినేజీ నిర్మాణాలకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఇ చెన్నకేశవరెడ్డి, ఇఇ ధనలక్ష్మి, ఎఇ ప్రతాపరెడ్డి, శానిటేషన్ విభాగ అధికారులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల సర్వే

ప్రజాశక్తి - సిద్ధవటం : మండల పరిధిలోని టక్కోలి గ్రామంలో 100/1 లో 0.59 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని, అదే గ్రామానికి చెందిన మల్లు వెంకట సుబ్బారెడ్డితోపాటు 100/2 లో 0.26 సెంట్ల డికెటి భూమిని అదే గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం గ్రామ సర్వేయర్‌తో వివాదాస్పద భూములను గుర్తించారు. సదరు నివేదిక మేరకు సిద్ధవటం తహశీల్దార్‌కు నివేదించి చర్యలు తీసుకుంటామని సర్వే బృందం తెలిపింది. దీంతో కొన్ని నెలలుగా నెలకొన్న సమస్యకు పరిష్కార మార్గం ఏర్పడనుంది

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి : జడ్జి

ప్రజాశక్తి-కాశినాయన : విద్యార్థులకు మెనూ ప్రకరారం భోజనాలు పెట్టాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె. పద్మశ్రీ పేర్కొన్నారు. మండల కేంద్రమైన నరసాపురంలోని ఎస్‌సి బాలుర, బిసి బాలికల వసతి గృహాలను శనివారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కడప జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు నరసాపురంలోని రెండు వసతి గృహాలను, ఓబులాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడ వసతులను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె వార్డెన్లు ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనాలు కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆమె వెంట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. గాయత్రి, మండల న్యాయ సేవా అధికార సంస్థ కమిటీ వారు, నరసాపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది, హాస్టళ్ల వార్డెన్లు విజయమ్మ, బాలరాజు ఉన్నారు.

త్యాగరాజ కాలనీలో డ్రెయినేజీ, రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - బద్వేలు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న త్యాగరాజ్ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు వర్షం నీరు రోడ్డు పైనే నిల్వ ఉంటుందని అక్కడ కాలనీవాసులు వాపోతున్నారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. శనివారం డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజు కాలనీలో పర్యటించి అక్కడే నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ త్యాగ రాజ కాలనీలో కొనేళ్లుగా డ్రెయినేజీ, రోడ్ల సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీటితో పాటు ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వస్తున్నాయని, ఇంట్లోంచి మోకాళ్ళ లోతు నీటిలో బయటికి రావాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యేకు, మున్సిపల్ చైర్మన్‌కు,కమిషనర్‌కు తెలియజేసినా ప్రయోజనం లేదన్నారు. ఈ విషయాన్ని ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె. ఆదిల్, రూరల్ కార్యదర్శి బాల గురయ్యా, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్, ఖలీల్‌బాష, సహాయ కార్యదర్శులు సురేష్, మాపిరా పాల్గొన్నారు.

మునగాకులో పోషకాలు మెండు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: మునగాకు పౌడర్ వాడడం వల్ల ఎ,బి,సి, కె విటమిన్లు, ఐరన్ సమృద్ధిగా లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ పి. లక్ష్మీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పబ్బాపురంలో ప్రజా ఆరోగ్య ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు, కిషోర్ బాలికలకు మునగాకు ఉపయోగాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చుని అన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, ఎఎన్ఎం సుజాత, ఆశావర్కర్ హైమావతి, వెంకటేశ్వరి, విజయలక్ష్మి గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మీదేవి

సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడో!

- 16 నాటి ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా
- ప్రశ్నార్థకంగా సభ్యత్వ నమోదు
- ఎన్నిక నిర్వహణపై రైతుల్లో చర్చ



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ఎప్పుడో తెలియడం లేదు. ఇటీవల రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 40 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. నీటి పారుదలశాఖ జిల్లా అధికార యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాయి. చెరువుల వారీగా ఎన్నికల అధికారుల నియామకాల్ని పూర్తి చేశాయి. సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడానికి వెనుకంజ వేసింది. ఎన్నికల నిర్వహణకు వెనుకంజ వేయడానికి గల కారణాలు ఏమి ఉంటాయనే అంశంపై చర్చనీయాంశంగా మారింది.

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లా సాగునీటి పారుదలశాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉండడం గమనార్హం. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేకపోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడినట్లు కనిపిస్తోంది.

సభ్యత్వం ఏదీ!

ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. కీలకమైన సభ్యత్వ నమోదు, ఎన్నికల యంత్రాంగాల నియామకాలకు బ్రేక్ పడింది. ఉమ్మడి జిల్లాల్లోని ఆయా చెరువుల పరిధిలోని సాగు విస్తీర్ణాన్ని బట్టి వందలాది మంది రైతులు కదిలించే ప్రయత్నం నిలిచిపోయింది. సభ్యత్వ నమోదు పన్ను చెల్లించడం మొదలగు నిబంధనల ప్రయాస తప్పింది. రెం డేళ్లుగా వర్షాలు లేక పంటలు పండని నేపథ్యంలో ఎంతమంది రైతులు సభ్యత్వ నమోదుకు ముందుకొస్తారనే అంశంపై నెలకొన్న సంది గ్ధతకు తెరపడింది.

నిలుపుదల వెనుక మతలబేమిటో!

సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ నిలుపుదల వెనుక కారణాలేమిటనే చర్చ నడుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రతిపక్ష వైసిపి అధిక సంఘాలను గెలిస్తే కూటమి సర్కారు పరపతి తగ్గుతుందనే సందేహం తలెత్తిందా అనే సందేహం కలిగిందేమోననే వాదన వినిపిస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ వైఖరితో జిల్లాల్లోని నీటి పారుదలశాఖ ఉన్నతాధికారుల్లోనూ ఆసక్తి సన్నగిల్లింది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రస్తావనే రాగానే కడప, అన్నమయ్య జిల్లాల ఇంజినీరింగ్ యంత్రాంగరం ఆయా మండలాల వారీగా చెరువుల జాబితా సేకరించింది.అనంతరం అసిస్టెంట్ ఇంజినీరింగ్ స్థాయి అధికారులను నియామకాలను సైతం పూర్తి చేసింది. ప్రభుత్వం ఉన్న ఫళంగా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఎన్నికల నిర్వహణ పనులను నిలిపేశారు. ప్రభుత్వంలో ఊగిసలాటకు ఎప్పుడు తెర పడుతుందో వేచిచూడాల్సి ఉంది.

మహాసభలను విజయవంతం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకుని కడప జిల్లా మహాసభలు ఈనెల 20న అంగరంగ వైభవంగా నిర్వహి ంచుకుంటున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. శనివారం డిఇఒ కార్యాలయంలో డిఇఒ అనురాధ చేతుల మీదుగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మహాసభలను పురస్కరించుకుని ఆది వారం ఉదయం 9 గంటలకు కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎర్రము క్కపల్లి సర్కిల్ మీదుగా యుటియఫ్ భవన్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ర్యాలీలో జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో భాగస్వా ములు కావాల ని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం 10 గంటలకు యు టిఎఫ్ భవన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డిఇఒ, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసిం హారావు, ఏడి మునీర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

న్యాక్ పీర్ టీం చైర్మన్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) పీర్ టీం చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం ఉన్న ప్రముఖ మహాత్మా గాంధీ డిగ్రీ కళాశాలను ఈ నెల 23,24న సందర్శించనుంది. ఈ బృందానికి సమన్వయకర్తగా డాక్టర్ ఎన్.ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. ఆయన్ను ఆచార్య శ్రీనివాసులు ప్రతిష్టాత్మమైన న్యాక్ పీర్ బృందంలో చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మ, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-వల్లూరు : ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని లేబాక రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికీ 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. **అట్లూరు :** ప్రజలకు వజ్రాయుధం లాంటిది సమాచార హక్కు చట్టమని మండల వ్యవసాయశాఖాధికారులు జి. రామయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు,రైతులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో డిపిఒ తనిఖీలు

ప్రజాశక్తి - సిద్ధవటం : మండలంలోని టక్కోలి గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు తప్పని సరిగాహాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీలో అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావం కారణంగా వర్షపు నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చల్లించాలన్నారు. విద్యుత్ దీపాల సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యదర్శి నాగ మునిరెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ శివయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణంతో 'బ్రౌన్ శాస్త్రి'కి శాశ్వత కీర్తి

ప్రజాశక్తి - కడప అర్బన్ : బ్రౌన్ గ్రంథాలయం పేరు వినిపించగానే డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గుర్తుకొస్తారని, ఆయన వ్యక్తిత్వం ఎందరికో స్ఫూర్తినిచ్చిందని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి అన్నారు. డాక్టర్ జానమద్ది 99వ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు కార్యాలయంలో జానమద్ది చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ విదేశీయుడైన బ్రౌన్ తెలుగుపట్ల చూపిన మక్కువ అందరికి స్ఫూర్తినిచ్చిందన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు బ్రౌన్ చేసిన కృషికి నివాళిగా బ్రౌన్ శాస్త్రి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఎంతో శ్రమకోర్చి బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించి వారి జ్ఞాపకంగా తెలుగువారికి గొప్ప కానుక ఇచ్చారని కొనియాడారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు లయన్ కల్లూరు బాలయల్లారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష రక్షణకు బ్రౌన్ కృషిచేస్తే ఆయన ఘనతను 'బ్రౌన్ శాస్త్రి' నేటి తరానికి ఈ గ్రంథాలయం ద్వారా అందించారన్నారు. కార్యక్రమంలో గొబ్బూరి కోటేశ్వరరావు, జ్యోతి జార్జి, విజయ్, డేవిడ్, నారాయణ, వీరయ్య, బాబు, రియాజ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ మహిళల ఆందోళన

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని రామనపల్లె గ్రామపంచాయతీ బిసి కాలనీలో మద్యం దుకాణం పెట్టకూడదని , ఆ కాలనీ మహిళలు శనివారం పెద్ద ఎత్తున పాల్గొని ఆందోళన చేశారు. మద్యం షాపు పెట్ట డం వల్ల మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు గ్రా మాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎలా పెడ˘తారని ప్రశ్నించారు. గతంలో మద్యం దుకాణాలు పెట్టడం వల్ల మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని, మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేసి తమల్ని ఇబ్బంది పెట్టొద్దని వారు విజ్ఞప్తి చేశారు. కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య ఒడ్డి చొరవ తీసుకొని మద్యం దుకాణం తమ కాలనీలో ఏర్పాటు చేయకుండా వేరే ఎక్కడైనా పెట్టే విధంగా, దుకాణం యజమానులకు సూచించాలని వారు తెలిపారు. ఈ దారి గుండా విద్యార్థులు, మహిళలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటామని, ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని వారు ప్రశ్నించారు. ఈ విషయమై మండల ఉన్నతాధికారులు అందరికీ కూడా విన్నవిస్తామని వారు చెప్పారు.



ఆందోళన చేస్తున్న రామనపల్లె బిసి కాలనీ వాసులు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - కడప : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని కడప వన్ టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆస్ట్రేలియా ఎ-21, ది మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సహకారంతో శనివారం మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు 'వాక్ ఫర్ ఫ్రీడం' ర్యాలీ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. ఎస్ఐ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ 2024 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 49.6 మిలియన్ల మంది ప్రజల అవయవాల, లైంగిక దోపిడీకి గురి అవుతున్నారని, ప్రముఖంగా లైంగిక దోపిడీకి మహిళలు, బాలికలు, చిన్నారులే బలవుతున్నారని చెప్పారు.

పాతరే!

ప్రజాదృష్టి

నూతన మద్యం పాలసీ ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టులాంటిది. నూతన పాలసీ అమలు చేయడంలో భాగంగా ప్రయివేటు వ్యాపారులకు గేట్లు తెంచడంపై మహిళలు, మేధావులు, అభ్యుదయవాదుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. కూటమి సర్కారు పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను సమిధలుగా చేయడంలో సఫలీకృతమైందనడంలో సందేహంలేదు. ఎక్సైజ్‌శాఖ కడప జిల్లాలో 139 మద్యం దుకాణాలకు 3,257 దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసింది. లాటరీ తగలని 3,118 మంది ప్రవేశ రుసుమును పోగొట్టుకుని నిరుత్సాహంతో వెనుదిరిగిపోవడం కనిపి ంచింది. ఇంత వరకు బాగానే ఉంది. వైసిపి సర్కారు హయాంలో కంటే మద్యం ధరలను తగ్గిస్తామని, నాణ్యమైన సరుకును అందుబాటులో ఉంచుతామని చేసిన ప్రచారం బెడిసి కొడుతోంది. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ మద్యం ధరలు తగ్గే వకాశాలు లేవనే సమాచారంతో మద్యం బాబుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అధిక ధరల కారణంగా పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉండేది. ఇది పేద కుటుంబ అవసరాలను ఒక రకంగా ఉపయోగపడేది. గ్రామసీమల్లో బెల్టు షాపుల బెడద లేకుండా ఉండేది. ఫలితంగా సామాన్య కుటుంబాల్లో ఘర్షణలు లేకుండా సాఫీగా సాగిన పరిస్థితి కనిపించేది. కూటమి సర్కారు నూతన మద్యం పాలసీ అమలు కారణంగా ప్రయివేటు మద్యం దుకాణాలకు గేట్లు ఎత్తింది. 139 మద్యం దుకాణాల్లో 131 మద్యం షాపులకు ప్రొవిజనల్ (తాత్కాలిక) లైసెన్స్ ఇచ్చేశారు. మిగిలిన ఎనిమిదింటికి నేడో, రేపో ఇచ్చే అవకాశం ఉంది. తాత్కాలిక లైసెన్స్ ఇచ్చిన వారం రోజుల తర్వాత పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వడంపై ఎక్సైజ్ యంత్రాంగం దృష్టి సారించింది. ప్రయివేటు మద్యం దుకాణ యజమానుల అత్యాశ కారణంగా పల్లెసీమల్లో బెల్టుషాపులు ఏర్పడతాయనడంలో సందేహం లేదు. వీటిని నివారించడం ఎంతవరకు సాధ్యమో ఆలోచించాలి. గత అనుభవాల దృష్ట్యా బెల్టుషాపులను కట్టడి చేయడం మాట అటుంచితే, బెల్టుషాపులు లేని గ్రామం ఉండదనే వాదన వినిపిస్తోంది. బెల్టుషాపులు ప్రశాంతంగా ఉండే గ్రామసీమల్లో కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోసే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన నెలకొంది. జిల్లాలో ఫ్యాక్షన్ సంస్కృతి కలిగిన గ్రామాలు, వెనుకబడిన మారుమూల గ్రామాల్లోని పేదలు, సామాన్యులు బెల్టుషాపుల బారినపడి తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు కారణంగా బెల్టుషాపుల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతన మద్యం పాలసీ అమలు కారణంగా జిల్లా వ్యాప్తంగా రూ.1.48 కోట్లు ఆదాయాన్ని ఆర్జించిందనే గణాంకాలు వినసొంపుగానే ఉన్నాయి. సమీప భవిష్యత్తులో జాతి మూలుగుల్ని పీల్చి పిప్పిచేసే ప్రమాదాన్ని నివారించే తరుణోపాయాల్ని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి. ఆదాయమే పరమావధిగా ఎంచి, బొక్కసాల్ని నింపు కోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంపై లేకపోవడం జాతి దౌర్భాగ్యమనే చెప్పాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి

యువత మద్యానికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

యువత మద్యానికి దూరంగా ఉండాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశా ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి సూచించారు. ఆయన అధ్యక్షతన కళాశాలలో శనివారం విద్యార్థులకు, అధ్యాపకులకు నెహ్రూ యువ కేంద్రం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమ ట్రస్ట్ నిపుణులు మాలకొండయ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అన్నారు. యువత మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమన్నారు. ముఖ్యంగా గంజాయి, పొగాకు, గుట్కా, పాన్ వంటి మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిగి, తమ కుటుంబాన్ని తమ గ్రామాన్ని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే కలిగే కలిగే నష్టాలను యువతకు వివరించారు. మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం.. దేశాభివృద్ధికి తోడ్పడుదాం అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.సుభాన్ సాహెబ్, ఆర్ఆర్సి కో-ఆర్డినేటర్ అయ్యవారిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ నవనీశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం-2005 పట్ల అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి సూచించారు. సింహాద్రిపురం రైతు సేవా కేంద్రంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం ఏదైనా సమాచారం అడిగిన వెంటనే 30 రోజుల లోపల ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సెక్షన్ 41సి ప్రకారం కార్యాలయ ఆవరణలో సమాచార హక్కు చట్టం బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పౌర సమాచార, సహాయ, అపిలేట్ అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లను తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందన్నారు. రైతులు, ఇతర వ్యక్తులు సమాచారం అడిగిన వెంటనే నిర్ణీత గడువులోపు సంతృప్తి స్థాయిలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమాచార హక్కు చట్ట ప్రకారం నిర్ణీత గడువు లోపు సమాచారం ఇవ్వకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : సమాచారం హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎఒ, సమాచార పౌర అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. నల్లబల్లె గ్రామ సచివాలయంలో ఎఒ శనివారం రైతులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పారదర్శకంగా, నిజాయితీగా పథకాలు అమలు చేసేలా అధికారులు పని చేస్తారని తెలిపారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తహశీల్దార్, సిఐ

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు


ప్రజాశక్తి - వేంపల్లె

సాంకేతిక విద్య ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తహశీల్దార్ హరినారాయణరెడ్డి, ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. స్థానిక కందుల ఓబులరెడ్డి చారిటీస్ ఐటిఐలో శనివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తక్కువ వ్యవధిలోనే నైపుణ్యం పెంపొందించుకొని ఉపాధి పొందడానికి పారిశ్రామిక శిక్షణ సంస్థలు దారి చూపుతాయని తెలిపారు. ఐటిఐ శిక్షణ పూర్తి చేసిన వారికి ఎక్కువగా పరిశ్రమలు, ఉత్పాదక తయారీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. సాంకేతిక పోస్టుల్లో సింహభాగం సంస్థలు ఐటిఐ చదువుకున్న వారికే భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఐటిఐ పూర్తి చేసిన యువతకు రైల్వే, సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, నీటి పారుదల, వృత్తి విద్య విభాగం, సాంకేతిక విభాగాలకు చెందిన ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. సిఐ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చక్రాయపేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ రాఘవ్యా, పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరులో పిచ్చికుక్క స్వైర విహారం

- 15 మందికి గాయాలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)


గాయపడిన బాలుడు

మైదుకూరు పట్టణంలో శనివారం పిచ్చికుక్క స్థానికులపై దాడి చేసింది. ప్రధాన రహదారిపై కనిపించిన వారిని కరిచింది. ఈ దాడిలో పిల్లలు, పెద్దలు కలిపి 15 మందికి గాయాలయ్యాయి. కొంత మంది స్థానికులు కుక్కను పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుంది. కుక్క దాడి చేసిన మందిని కరవడంతో పలువురు గాయాలయ్యాయి. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలు, పందుల బెడద నుండి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణం..

మైదుకూరు పట్టణంలో శనివారం పిచ్చికుక్క ప్రజలపై దాడికి మున్సిపల్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే కారణమని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ ఆరోపించారు. ఆవులు, కుక్కలు, పందులు, మానసిక రోగుల నుండి ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. ధర్నాలు, నిరసనల రూపంలో రైతు సేవాసమితి, ఇతర ప్రజా సంఘాలు కలుపుకొని తెలియజేసినా ఉపయోగం లేదన్నారు. ప్రతి వీధిలో పందులు, కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పెంపుడు జంతువులు రోడ్లపై తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


పగిడి జయాకర్ (ఫైల్‌ఫోటో)

గుండెపోటుతో ఆర్‌టిసి కండక్టర్ పగిడి జయాకర్ మృతి చెందారు. ఆ మేరకు శనివారం జయాకర్ కుమారుడు మాట్లాడుతూ తన తండ్రి జయాకర్ శుక్రవారం విశ్రాంతిలో ఉన్నారన్నారు. మధ్యాహ్నం రెండు గంట లకుపైగా గుండెపోటు రావడంతో వెంటనే స్థానిక క్యాంబెల్ ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడికి వెళ్లగా డాక్టర్ పరీక్షించి మరణించారని తెలిపారు. ఆయనకు ఇంకా మూడేళ్లు సర్వీస్ ఉన్నారన్నారు. మా అమ్మ ఇది వరకే చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా తల్లిదండ్రులకు ముగ్గురు ఆడపిల్లలు, తాను సంతానమన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయన్నారు. మా పెద్ద అక్క కూడా చనిపోయిందని తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు.

వర్షాలతో రైతులకు భారీ నష్టం

పంట చేతికొచ్చే సమయంలో తుపాను దెబ్బతో ఉల్లి, టమోటా, పత్తి, చామంతికి నష్టం


ఉల్లి పొలంలో చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి - వేముల

బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి జిల్లాలో తీవ్ర ప్రభావం చూపడంతో వేముల మండల వ్యాప్తంగా పలు పంటలు దెబ్బ తిన్నాయి. ఆరురోజులుగా పడుతున్న వర్షాలకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ వల్ల నష్టపోయామని ఉల్లి రైతులు కన్నీటిపర్యంత మవుతున్నారు. మండలంలో ఉల్లి సాగుకు రైతులు రూ.లక్షలు పెట్టుబడి పెట్టారు. పంట బాగా వస్తుందనే ఆశతో ఉన్న ఉల్లి రైతులకు వర్షాలు దెబ్బతీశాయి. ఈ ఏడాదైనా ఉల్లి పంట చేతికొస్తే కొంతవరకైనా కష్టాలు తీరుతాయని రైతులు భావించారు. ఉల్లి గడ్డలు కోసే సమయంలో వర్షాలు పడ్డాయని, పొలంలోకి దిగలేకున్నామని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు పరిహారం అందేలా చూడాలని రైతులు నారు బోయిన భాస్కర్, చాగలేటి గోపాల్, ప్రదీప్‌రెడ్డి, గొందిపల్లి గంగులయ్య, లక్ష్మీదేవి, చాగలేటి మల్లికార్జున, చాగలేటి ఉత్తయ్య వేడుకుంటున్నారు.

పత్తి, టమోటా, ఉద్ది పంట పొలాల్లో చేరిన నీరు..

ఉల్లి పంటతోపాటు వర్షపునీరు పత్తి, టమోటా, చామంతి, ఉద్ధి పంట పొలాల్లోకి చేరింది. ఆయా పంటలు కూడా దెబ్బ తింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస తుఫానులతో తాము ఈ ఏడాది కూడా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. ఇప్పటికే టమోటా పంట తుది దశలో ఉంది. ఈ వర్షానికి టమోటా పంట కుళ్లిపోయే స్థితిలో ఉందని మహిళా రైతు లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్ధి పంట, చామంతి తోట కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


టమోటా చేలో నిలిచిన వర్షపునీరు

బెల్ట్‌షాపులను నియంత్రించలేరా..!

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలో బెల్ట్ షాపులను అధికారులు నియంత్రించలేరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల వద్దకే పాలన నుంచి ప్రజల వద్దకే మద్యం అనేలా అమ్మకాలు సాగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోరు. మఠంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకొని మద్యం విక్రయిస్తున్నారు. బ్రహ్మంగారిమఠంలో వైన్ షాపు పెట్టుటకు అనుమతులు లేనందున ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లెపల్లిలో పెట్టారు. బ్రహ్మంగారి మఠంలో మాత్రం దాదాపు 20 మంది మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.50 అధికరేటుతో అమ్ముతున్నారు, ప్రభుత్వ బెల్ట్‌షాపులకు అనుమతులు ఇవ్వకున్నా, మఠంలో మాత్రం విచ్చలవిడిగా మద్యం దొరుకుతుంది. మద్యం అమ్మడంలో కొంతమంది షాపులు ఏర్పాటు చేసుకుని అమ్ముతుండగా, మరికొందరు మాత్రం మొబైల్ షాపులు ఏర్పాటు చేసుకొని, ప్రజల వద్దకే మద్యం అనేలా తయారవుతోంది. సంబంధిత అధికారులు మాత్రం అడపాదడపా దాడులు చేస్తూ, చట్టం తనపని తాను చేసుకుంటూ వెళుతోందన్నట్లు వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రోజంతా పనికి వెళ్లి కష్టపడినా కూడా రూ.500 కూలి మాత్రమే వస్తుంది.. అదే 10 బాటిళ్లు తెచ్చుకొని ఒక గంట అమ్మితే ఆ కూలి వస్తుందని కొందరు యువకులు భావిస్తున్నారు. అధికా రులు పట్టనట్లు వ్యవహరి స్తుండడంతో బెల్ట్‌షాపులు అధికమవుతున్నాయి. ఈ పని చేయడం తప్పు కాదన్నట్లు ఉంటున్నారు. ఎవరైనా బెల్ట్‌షాపుల ద్వారా మద్యాన్ని అమ్ము కోవచ్చు అని ఆలోచిస్తున్నారు. బ్రహ్మంగారిమఠానికి ఒక చరిత్ర ఉందని, కాలజ్ఞాన సృష్టికర్త బ్రహ్మంగారి సజీవ సమాధి, నిష్ట వహించిన పుణ్య స్థలమని స్థానికులు భావిస్తున్నారు. ఇలాంటి ప్రదేశంలో మందు వాసన రాకూడదంటున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా అధిక రేట్లు పలికే అవకాశం ఉందన్నారు. కల్తీ మద్యం అమ్మే ప్రమాదం ఉందని, పేద కుటుంబాలు దెబ్బతింటాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను అరికట్టాలని, మఠం పవిత్రతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో కనీస వసతుల కల్పనే లక్ష్యం


లక్ష్మీపేటలో రోడ్డు నిర్మాణానికి చేస్తున్న భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లి, లక్ష్మీపేట, కుచ్చుపాప, చియ్యపాడు, వెదురూరు గ్రామాలలో శనివారం ఉపాధి హామీ నిధులతో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎ.వీరకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. బద్రిపల్లిలో రూ.9.70 లక్షలతో 242 మీటర్లు, కుచ్చుపాపలో రూ.4 లక్షలతో 100 మీటర్లు, లక్ష్మీపేటలో రూ.6.50 లక్షలతో 140 మీటర్లు, వెదురూరులో రూ.20 లక్షలతో 520 మీటర్లు, చియ్యపాడులో రూ.15 లక్షలతో 390 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిపి గురివిరెడ్డి, వీరశేఖర్ రెడ్డి, నారపరెడ్డి, గుత్తి వీరనారాయణ యాదవ్, చియ్యపాడు సర్పంచ్ శివప్రసాద్, శివ రామ కృష్ణారెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ఇంద్ర, కుచ్చుపాప సర్పంచ్ రామసుబ్బారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అలిరెడ్డిపల్లెలో సిసి రోడ్ల నిర్మాణానికి రామమునిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మండలాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమా కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, సయ్యద్ పీరా, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు, జబిబుల్లా, వీరబద్ర, ఉపాధి హమీ పథకం ఎపిఒ పార్వతి, పిఆర్ ఎఇ శ్రీనివాసులు, టిడిపి నేతలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం బాల తిమ్మయ్యగారిపల్లె ఎస్సీ కాలనీలో పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, మండల టిడిపి ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పల్లెలోనూ పల్లెపండగ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కనీస సౌకర్యాలు తాగునీరు, సిసి రోడ్లు, కరెంటు సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రవి, అమరనాథ్, పూర్ణ, కిషోర్, ప్రసాద్, పరమేశ్వర, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు


చక్రాయపేట : సిసి రోడ్డు నిర్మాణానికి..

ఖాజీపేట : ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంపిడిఒ దివిజా పేర్కొన్నారు. మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాములు యాదవ్, రాజారెడ్డి, అంకాల్ యాదవ్, పిఆర్ ఎఇ కృష్ణప్రసాద్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఏసు పాదం, టిడిపి నాయకులు సామేల్, నరసింహ, లడ్డు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఖాజీపేట : సిమెంట్ రోడ్డుకు భూమిపూజ

ముద్దనూరు : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఉప్పలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పల్లా గంగయ్య తెలిపారు. మండలంలోని చిన్నకత్తెరపల్లెలో శనివారం ఎంపిడిఒ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పల్లె పండుగ వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఉప్పలూరు గ్రామ పంచాయతీ చిన్న కత్తెరపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.17 లక్షల వ్యయం చేయనున్నారు. సర్పంచ్ పల్లా గంగయ్య, మాజీ ఉప సర్పంచ్ పల్లా గోపాలకృష్ణ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వీరభద్రుడు, ఏపీఓ గంగయ్య, పిఆర్ ఎఇ వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయభారతి, ప్రజలు పాల్గొన్నారు.


ముద్దనూరు : పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సహకరిద్దాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు అందరూ సహకరించాలని ఎఎస్ఐ రాజరామణి తెలిపారు. పట్టణంలోని పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం మానవ అక్రమ రవాణా నిర్మూలనలో భాగంగా విజయ్‌కుమార్ సర్కిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు ప్ల కార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో మహిళలే కాకుండా బాలికలు, పురుషులు కూడా అక్రమ రవాణా జరుగుతోందన్నారు. వీటిని అరికట్టడంలో పోలీస్‌శాఖ అద్భుతంగా పని చేస్తోందన్నారు. మానవ అక్రమ రవాణా విషయం తెలిసిన వారు కచ్చితంగా వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లో నిర్భయంగా తెలిపాలన్నారు. కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక మహిళా కానిస్టేబుళ్లు, స్నేహ సమితి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కృపా ఫౌండేషన్ నిర్వాహకురాలు సంధ్య, ఎన్‌జిఒ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిశ్శబ్ద నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ శ్రీదేవి కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన పసికందు నుంచి వయోవృద్ధుల వరకు మానవ అక్రమ రవాణా జరుగుతోందన్నారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు వాగ్దాడం శివశంకర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కిన్నెర ప్రసన్నకుమార్, ఇమ్మిడిశెట్టి సతీష్ బాబు, సుబ్బు, విజయ్ పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ముద్దనూరు

అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ హెచ్చరించారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో శనివారం సిఐ దస్తగిరి పాత బస్టాండ్ కూడలి నుంచి నాలుగు రోడ్ల వరకు ప్రత్యేక బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం దుకాణాల ఏర్పాటులో నెలకొన్న వివాదం వల్ల శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సిఐలు లింగప్ప, వెంకటరమణ, ఎస్ఐలు మైనుద్దీన్, తాహీర్ హుస్సేన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు : సిఐ

చాపాడు : దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిన్న పెద్దయ్య హెచ్చరించారు. చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో శనివారం ఆయన ట్రాఫిక్ సమస్యలను తనిఖీ చేశారు. దుకాణాల ముందు వాహనాలు అడ్డుగా నిలుపుతూ.. రోడ్డుపైన వెళ్లే ఇతర వాహనాలకు అంతరాయం కలిగి స్తున్నారని గుర్తించామన్నారు. రోడ్లపై గుంపులుగా వాహనాలు నిలపకుండా టీ షాపులు, దుకాణాల వారు జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రెండవ వార్డు వినాయక నగర్ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారంమైంది. రెండేళ్ల నుంచి తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయి మంచి నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను ప్రజలు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలు శనివారం నగర పంచాయతీ వైస్ చైర్మన్ చంద్రకళ, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర డేవిడ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి వినాయక నగర్ ప్రజలకు తాగునీరు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణికి ఫోన్ ద్వారా కోరారు. ఆయన వెంటనే స్పందించి నీళ్ల ట్యాంకర్లు పంపించారు. సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్, వైస్ చైర్మన్ ప్రజలకు తెలిపారు.


ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ సూచించారు. పట్టణ పరిధిలోని నగరిగుట్టలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పర్యటించారు. ప్రజలకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తల నిర్వహిస్తున్న లార్వా సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మనోరమ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. పులివెందుల ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ మాట్లాడుతూ దోమ తెరలు వాడా లని సూచించారు. కార్యకమంలో మెడికల్ కాలేజీ ఎస్.పి.ఎం.డిపార్ట్మెంట్ డాక్టర్ కేశవ, స్నేహ, ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, హెల్త్‌ఎడ్యుకేటం లక్ష్మీకల్యాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జికెఎల్ఐ ఇఇగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సింహాద్రిపురం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఇఇ శ్రీనివాసులు

గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ (జికెఎల్ఇ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా (ఎఫ్ఎసి) శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి ఫిబ్రవరిలో ఉద్యోగోన్నతిపై వెళ్లారు. అప్పటి నుంచి పిబిసి ఇఇ రాజశేఖర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో పైడిపాలెం రిజర్వాయర్, పులివెందుల బ్రాంచ్ కెనాల్, ఫీడర్ కెనాల్, ఫీడర్ కెనాల్, మల్లెల కాలువ పరిధిలోని చెరువులకు నీటి నిలువలతోపాటు రైతులకు అవసరమైన మేరకు నీటిని విడుదల చేస్తామన్నారు. రైతుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మద్యం, ఇసుకపై వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని జిల్లా పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు ఆధారాలు లేకుండా మద్యం దందా, ఉచిత ఇసుక ఎక్కడైనా ఇచ్చారా అని మాట్లాడుతూ ఉంటే రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి దశలవారీగా మద్య నిషేధమని చెప్పి 2019లో అధికారంలోకి వచ్చారన్నారు. మద్యనిషేధం చేయకపోగా.. బేవరేజెస్ కార్పొరేషన్ ష్యూరిటీ పెట్టి రూ.30 వేల కోట్లు అప్పు తెచ్చి సంక్షేమ పథకాల ముసుగులో ప్రజల ప్రాణాలను బలిగొన్న విషయం మర్చిపోయారా అన్నారు. వైసిపి తెచ్చిన మద్యం పాలసీ రద్దు చేసి పేద ప్రజలకు మేలు చేసే కొత్త మద్యం పాలసీ తెచ్చి 72 గంటలు కాకముందే నిందలు వేయడం మంచిది కాదన్నారు. ఉచిత ఇసుక ప్రజలకు అందడంలో ఇంకా కొన్ని లోపాలు ఉన్నాయని ఎమ్మెల్యేలు, అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే సీనరేజీ, జిఎస్‌టి రద్దు చేయుటకు నిర్ణయం కూడా తీసుకున్నారన్నారు.


పి.మునిశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి

ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం రెండవ రోజు ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఆయా గ్రామాల్లో మురికి కాలువలు, మురికి కుంటలు, వీధిలైట్లు, సిసి రోడ్ల మరమ్మతులు వంటి వాటిపై ఎంపిడిఒ, టిఒటి విజయ్‌కుమార్ నాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిడి జె సుబ్బారెడ్డి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి వార్డు మెంబర్లు సహకరించాలని ఎంపిడిఒ ఎ.వీర కిషోర్ తెలిపారు. స్థానిక సభా భవనంలో రెండవ రోజు వార్డు మెంబర్ల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వార్డు మెంబర్లది కీలక బాధ్యత అన్నారు. స్థానికంగా సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు, విధులపై ట్రైనర్ దేవేంద్రరెడ్డి, జానకిరామ్, సుబ్బరాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు , వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమ జిల్లాలలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం వేంపల్లెలో ఉండి గండి క్షేత్రంలో టెంకాయలు విక్రయానికి కూలి పని చేసుకుంటూ.. తమవంతుగా సి.శీను, సతీమణి మల్లమ్మ రూ.1,00,516 విరాళాన్ని అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేష వస్త్రం, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సంధర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత ప్రభుత్వ హయాంలో జగనన్న భూ సురక్ష పేరిట భూముల సర్వే నిర్వహించగా వచ్చిన పలు ఆక్షేపణలను ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా భూ సమస్యలు పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి పంచాయతీ కేత్రీ సచివాలయంలో సర్వేరెడ్డిపల్లె గ్రామానికి సంబంధించిన రీ సర్వే సమస్యలు పరిష్కార కార్యక్రమాన్ని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. రీసర్వే ప్రాజెక్టు అధికారులు ఆర్ఐ సుదర్శన్, సర్వేయర్లు, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొని, భూ సమస్యల రీ సర్వే పరిష్కారానికి వినతి పత్రాలు స్వీకరించారు.

గ్రామసభల్లో అర్జీలు ఇవ్వొచ్చు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మండల పరిధిలో ఈనెల 22న రీ సర్వేకు సంబంధించి సమస్య ఏదైనా ఉంటే అర్జీలు ఇవ్వవచ్చునని తహశీల్దార్ నజీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పులివెందుల మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి 22న రచ్చుమర్రిపల్లి, 23, 24న కణంపల్లి, 25న రాగిమానుపల్లి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలుంటే పరిష్కారానికి ప్రజలు అధికారులకు అర్జీలివ్వాలని ఆయన కోరారు.